తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## పాలారు చెక్‌డ్యామ్‌లో ఈతకుదిగి వ్యక్తి మృతి



కుప్పం, జూలై 4 ప్రభాతవార్త

మండలంలోని పెద్దవంక శ్రీ కనకనాశమ్మ ఆలయం వద్ద గల పాలారు చెక్‌డ్యామ్‌లో ఈతకు దిగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఫైర్ అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపిన మేరకు వివరాలిలా.. తమిళనాడు రెడ్డితోపుకు చెందిన మురళి (35) అతని స్నేహితులు సుమారు పదిమంది మంగళవారం పాలారు చెక్‌డ్యామ్ వద్దకు చేరుకుని ఈతకు దిగారన్నారు. అయితే మురళి నీట మునిగిపోయాడన్నారు. తమకు సమాచారం అందడంతో హుటాహుటిన సంఘటనా స్థలికి చేరుకుని మురళి కోసం గాలించగా అతని మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది రామూర్తి, నరేష్, రెడ్డెన్న, కృష్ణయ్య, మణి పాల్గొన్నారు. కుప్పం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అశ్రునయనాల నడుమ ఆనందరావుకు అంతిమ వీడ్కోలు

### పోలీసుల గౌరవ వందనం



చంద్రగిరి, జూలై 4 ప్రభాతవార్త:

అశ్రునయనాల నడుమ ఆనందరావుకు అంతిమ వీడ్కోలు పలికారు. కల్‌రోడ్ పల్లిలోని ఆనందరావు వ్యవసాయ క్షేత్రంలో జరిగిన అంతిమ సంస్కార కార్యక్రమంలో ఎంపి గోరంట్ల మాదవ్, సిఐ రాజశేఖర్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది హాజరై ఆనందరావు భూతిక కాయం వద్ద గౌరవ వందనం చేశారు. ఆనందరావు మృతి పట్ల వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామస్థులు కన్నీటి పర్యంతమవుతూ వీడ్కోలు పలికారు.

# ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారు ..

## చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లపై సిఎం వైఎస్ జగన్ ఫైర్




చిత్తూరు, జులై 4 ప్రభాతవార్త:

ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పక్కా ప్లాన్‌తో ప్రజలను వెన్నుపోటు పొడుస్తున్నారని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. చిత్తూరు పర్యటన సందర్భంగా మంగళవారం చిత్తూరు పోలీసు పెరేడ్ మైదానంలో జరిగిన బహిరంగ సభలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 2014-19 సంవత్సరాల్లో రాష్ట్రంలో చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్‌లు అధికారం చెలాయించారని, ఈ కాలంలో అన్ని వర్గాల ప్రజలను వీరు వెన్నుపోటు పొడిచారన్నారు. 2019 అనంతరం జరిగిన ఎన్నికల్లో తాను గెలుపొంది సిఎంగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఇప్పటి వరకు 2.23 లక్షల కోట్ల రూపాయలు నేరుగా అక్కా చెల్లెమ్మలు, అవ్వతాతల బ్యాంకు ఖాతాల్లోకి సంక్షేమ పథకాల ద్వారా జమ చేయడం జరిగిందన్నారు. వీరి కాలంలో ఎందుకు చేయలేదని సిఎం నిలదీశారు. అప్పుడు ఇప్పుడు అదే రాష్ట్రం, అదే బడ్జెట్ అని అన్నారు. ఇప్పుడు తాను చేసిన పనిని అప్పుడు వీరు ఎందుకు చేయలేదని నిలదీశారు. వీరికి తెలిసిందల్లా ఒక్కటేనని దోచుకోవడం, పంచుకోవడం, దాచుకోవడం మాత్రమే అన్నారు. దేశంలో ప్రతిష్టాత్మకమైన వేలూరు సిఎంసి మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడానికి తన తండ్రి దివంగత సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రయత్నించారన్నారు. వేలూరు సిఎంసి ఆసుపత్రి నిర్మాణానికి గుడిపాల మండలం చీలాపల్లి పరిసరాల్లో 600 ఎకరాల స్థలంను కేటాయించారన్నారు. ఈ స్థలం కేటాయించడానికి అనేక అడ్డంకులు ఎదురయ్యాయన్నారు. ఈ స్థలం కేటాయింపుకు ఓ పత్రికాధిపతి వియ్యంకుడు అడ్డు తగిలారన్నారు. అలాగే చిత్తూరు విజయ డెయిరీని 2002 సంవత్సకంలో కుట్రపూరితంగా మూసి వేశారన్నారు. 1988 సంవత్సరంలోనే 2.5 నుండి 3 లక్షల లీటర్ల పాలసేకరణ చేసిన చిత్తూరు డెయిరీపై 1993 సంవంత్సరంలో నారా చంద్రబాబునాయుడు కళ్ళు పడ్డాయన్నారు. అప్పుడు సిఎంగా వున్న చంద్రబాబు చిత్తూరు విజయ డెయిరీని ఒక పద్ధతితో కుట్రచేసి నష్టాల్లోకి నెట్టి 2002 ఆగస్టు 31 నాటికి ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా మూసి వేశారన్నారు. చంద్రబాబునాయుడు హెరిటేజ్ డెయిరీ లాభాల బాటలో పయనించిందని, చిత్తూరు విజయ డెయిరీని నిర్వీర్యం చేసి హెరిటేజ్ లాభాలు ఆర్జించిందని ఆరోపించారు. ఫలితంగా వేలాది రైతులు, వందలాది కార్మికుల బతుకులు రోడ్డుపై పడిందన్నారు. ఎన్నికల ముందు నిర్వహించిన పాదయాత్ర సందర్భంగా చిత్తూరు డెయిరీ పరిస్థితిని రైతులు వివరిస్తే నేను విన్నాను...! నేను వున్నాను...! అన్నానని ఈ క్రమంలో ప్రస్తుతం డెయిరీ అప్పులు 182 కోట్ల రూపాయలు చెల్లించి ఆమూల్ సంస్థకు డెయిరీని అప్పగించడం జరిగిందన్నారు. ఆమూల్ సంస్థ 385 కోట్ల రూపాయల పెట్టుబడితో డెయిరీని అభివృద్ధి చేస్తోం దన్నారు. దీంతో 5 వేల మందికి ఉపాధి, 2 లక్షల మందికి పరోక్ష ఉపాధి, లక్షలాది మంది రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. సొంత ప్రాంతం చంద్రగిరిలో గెలవలేని ప్రతిపక్ష నేత నారా చంద్రబాబు 35 సంవత్సరాల క్రితం కుప్పంకు వలస వెళ్ళారని, సొంత రాష్ట్రంలో ఇల్లు కట్టుకోలేని ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు ఈ 40 సంవత్సరాలుగా సొంత నియోజకవర్గం కుప్పంలో సైతం ఇల్లు నిర్మించుకోలేదన్నారు. ఇప్పుడు కుప్పంలో ఇల్లు నిర్మించుకోవడానికి వస్తే ప్రభుత్వం అడ్డుకొంటుందని సాకులు చెప్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు, పవన్‌కళ్యాణ్‌లకు సామాజిక న్యాయం తెలియదని, సామాజిక అన్యాయం మాత్రం చేస్తారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఉషశ్రీ చరణ్, డిప్యూటీ సిఎం నారాయణస్వామి, జిల్లా మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కె రోజా, ఎంపీలు రెడ్డప్ప, మిధున్‌రెడ్డిలు, ఎమెల్సీ భరత్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబు, వెంకటేగౌడ, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, నవాజ్‌భాషాలు, కలెక్టర్ సగిలి షన్మోహన్, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ బుల్లెట్ సురేష్, అర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానందరెడ్డి, కుడా ఛైర్మన్ వెంకటరెడ్డియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన వైద్యం దిశగా అడుగులు

### - సిఎంసి మెడికల్ కళాశాల నిర్మాణానికి భూమి పూజ చేసిన సిఎం

గుడిపాల, జులై 4 ప్రభాతవార్త:



వైద్యం కోసం వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవ అందించాలని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిఎంసి వైద్యాధికారులకు సూచించారు. గుడిపాల మండలం చీలాపల్లి సిఎంసి ఆసుపత్రి ఆవరణలో మంగళవారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిఎంసి మెడికల్ కళాశాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి ఉషశ్రీ చరణ్, డిప్యూటీ సిఎం నారాయణస్వామి, జిల్లా మంత్రి ఆర్‌కె రోజా, ఎంపీలు రెడ్డప్ప, మిధున్‌రెడ్డిలు, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబులు, కలెక్టర్ సగిలి షన్మోహన్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, జడ్పీ వైస్ ఛైర్మన్ భూమిరెడ్డి ధనంజయరెడ్డి, రమ్యలు, ఎంపిపి ప్రసాద్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## చంద్రబాబుపై సిఎం జగన్ పంచ్‌లు

- స్వలాభం కోసం రైతుల డెయిరీ సర్వ నాశనం
- చక్రాలు లేని సైకిల్ ఎక్కలేని నాయకుడు,
- తైలం పోస్తే గ్లాసు నింపుకోలేని మరొక నాయకుడు
- వెన్నుపోటు వీరుడు ఒకరు, ప్యాకేజీ సూరిడు మరొకరు

చిత్తూరు, జులై 4 ప్రభాతవార్త:

మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు సొంత జిల్లా పర్యటన నిమిత్తం మంగళవారం విచ్చేసిన సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడుపై పంచ్‌లపై పంచ్‌లు వేసి అదరగొట్టారు. జిల్లాలో ఎవరిని అడిగినా జిల్లాకు చంద్రబాబునాయుడు చేసిన కీడును కథలు కథలుగా చెప్తారని అదే జిల్లాకు ఎదైనా చంద్రబాబునాయుడు మంచి చేశారని అడిగితే ఒక్కటంటే ఒక్కటి చెప్పలేని పరిస్థితిలో ప్రజలు వున్నారని పంచ్ వేశారు. అలాగే రోజుకు 2.5 లక్షల లీటర్ల నుండి 3 లక్షల లీటర్ల పాల సేకరణతో లాభాల్లో నడుతుస్తు చిత్తూరు విజయ డెయిరీపై ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు కన్ను పడటంతో డెయిరీ సర్వ నాశనం అయ్యిందన్నారు. అదే సమయంలో స్వంత డెయిరీ లాభాల్లో వెళ్తుంటే సహకార డెయిరీ మాత్రం ఎందుకు నష్టాలు వచ్చాయని సిఎం ప్రశ్నించారు. స్వలాభం కోసం రైతుల డెయిరీ అయిన విజయ సహకార పాల డెయిరీని అధికార దాహంతో అప్పటి సిఎం నారా చంద్రబాబునాయుడు ఉరి వేశారని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రతిపక్ష నేత చంద్రబాబునాయుడు పరిస్థితి చక్రాలు లేని సైకిల్ ఎక్కలేని నాయకుడిగా మిగిలిపోతున్నారన్నారు. అలాగే జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై సైతం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పంచ్‌లు వేశారు. చక్రాలు లేని సైకిల్ ఎక్కలేని ఓ నాయకుడు వుంటే తైలం పోస్తే కాని గ్లాసు నింపుకోలేని మరొక నాయకుడంటూ సిఎం వైఎస్ జగన్ జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌పై పంచ్ వేశారు. అలాగే ప్రతిపక్ష నేత నారా చంద్రబాబుపై సిఎం వైఎస్ పవన్ లాస్ట్ పంచ్ వేస్తూ వెన్నుపోటు వీరుడు ఒకరైతే ప్యాకేజీ సూరిడు మరొకరని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పంచ్ వేశారు.

### మృత్యువుల్లోనూ....

## వీడని భార్యభర్తల బంధం

### బస్సు, స్కూటర్ ఢీ దంపతులు మృతి - బలిజమొండివెంగనపల్లెలో విషాదం



మృతుల(ఫైల్‌ఫోటో)



ఢీ కొన్న ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం

వెదురుకుప్పం, జూలై 4 ప్రభాతవార్త :

బస్సు స్కూటర్ ఢీ కొన్న ప్రమాదంలో భార్యభర్తలు ఇద్దరు మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని మాంబేడు పంచాయితీ పరిధిలోని కసవనూరుకు సమీపంలో ద్విచక్ర వాహనం ఆర్టీసీ బస్సు ఢీ కొన్న ప్రమా దంలో తీవ్ర గాయాలపాలై మృతి చెందారు. వెదురుకుప్పం మండలం కాపుమొండి వెంగనపల్లె పంచాయితీ పరిధిలోని బలిజమొండివెంగనపల్లెకు చెందిన పోటూగారి బాబు(55), హేమలత అలియాస్ లత ఇద్దరు ద్విచక్ర వాహనంలో వెళ్ళుతుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో తీవ్ర గాయాలై పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రాథమిక చికిత్స నిమిత్తం పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంకు తరలించారు. పరీక్షలు నిర్వహించి వైద్యులు బాబు అప్పటికి మృతి చెందిన్నట్లు ధృవీకరించారు. లతను మెరుగైన చికిత్స కొరకు తిరుపతికి తరలించమని చూచించడంతో ఆమెను తిరుపతికి తీసుకెళ్ళుతుండగా మార్గమాధ్యంలో మృతి చెందినట్లు చెప్పారు. దీంతో మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రూయా ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. మృత్యుడు తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపారు. వీరు తిరుపతిలో స్థిరపడిన్నట్లు చెప్పారు. మృత్యులకు దినేష్, మోహన్ కృష్ణ ఇద్దరు కుమారులు ఉన్నారు. సమాచారం తెలిసి బలిజమొండివెంగనపల్లె గ్రామంలో విషాదం అలుముకుంది. మృత్యువుల్లోనూ భార్య భర్తల బంధం వీడ లేదని పలువురు కంట తడిపెట్టారు. సమాచారం తెలిసి వెదురుకుప్పం పోలీసులు సంఘటన స్థలం చేరుకుని ప్రమాదం కారణాలు పరిశీలించి కేసు నమోదు చేసి ప్రమాదంకు కారణమైన ఆర్టీసీ బస్సును స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## రాజన్న ఇచ్చిన గిఫ్ట్ జగనన్న

### మంత్రి రోజా



లబ్ధిదారులకు ధృవపత్రాలు అందిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు, జూలై 4 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రజలకు రాజన్న ఇచ్చిన గిఫ్ట్ జగనన్న అని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారని తెలిపారు. మండలంలోని రామకృష్ణాపురం సచివాలయ పరిధిలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి మహిళా సాధికారత దిశగా అమ్మఒడి, చేయూత వంటి పథకాలు అమలు చేస్తూ మహిళా పక్షపాతి అని నిరూపించుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి వాగ్ధానాన్ని నెరవేరుస్తున్నారన్నారు. గతంలో ఏదైనా సర్టిఫికెట్, ఇల్లు, పెన్షన్ కోసం మండల రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని ప్రస్తుతం ఇంట్లో కూర్చుంటే వాలంటీరు వచ్చి ఆయా సర్టిఫికెట్‌లు, పెన్షన్ అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డుల్లో మార్పులు వంటివి సులభతరం చేస్తూ ప్రభుత్వ వ్యవస్థను ప్రజల చెంతకు చేరవేసిందన్నారు. అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగకూడదనే ఉద్దేశ్యంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందిస్తున్నామన్నారు. సురక్ష ద్వారా 11 సేవలు ఉచితంగా సత్వరంగా అందిస్తున్నామన్నారు. ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో నెల రోజుల పాటు సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు. సర్వీస్ ఛార్జీ లేకుండానే ఉచితంగా అన్ని ధృవపత్రాలు అందిస్తున్నామన్నారు. అనంతరం లబ్దిదారులకు ధృవపత్రాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ విరిత, జెసిఎస్ కన్వీనర్ భాస్కర్‌యాదవ్, నేసనూరు, శిరుగురాజుపాలెం సర్పంచ్‌లు గోవిందస్వామి రెడ్డి, మురళీమోహన్, నాయకులు దేవేందర్‌రెడ్డి, శ్రీ విద్య విద్యాసంస్థల ఛైర్మన్ జి.ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రావెల్‌ను మింగేస్తున్న వైకాపా నాయకులు

### -చంద్రగిరి టిడిపి అభ్యర్థి పులివర్తి నాని



తిరుపతిరూరల్, జూలై 4 ప్రభాతవార్త:

తిరుపతి అర్బన్ మంగళం పంచాయతీలలో అధికార వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పంచభూతాలను మింగేస్తున్నారని చంద్రగిరి నియోజకవర్గం టిడిపి అభ్యర్థి పులివర్తి నాని ఆరోపించారు. తిరుపతి నగరానికి సమీపాన ఉన్న మంగళం పంచాయతీలలో ప్రభుత్వ భూములు ఓ పక్క కనుమరుగైతున్నాయని, మరో పక్క గుట్టలను సైతం కబ్జా చేసి, గ్రావెల్ విక్రయిస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు అవినీతిని అడ్డుపెట్టుకుని భూ కబ్జాదారులు పేట్రేగిపోతున్నారు. మంగళం పరిధిలోని తిరుమల నగర్ పంచాయతీలో సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డుకు కేటాయించిన ప్రభుత్వ స్థలంలో వైకాపా నాయకులు గ్రావెల్‌ను కొల్లగొట్టి కోట్ల రుపాయాలను సోమ్ము చేసుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. మంగళవారం పులివర్తి నాని తిరుమల నగర్‌లో విలువైన గ్రావెల్‌ను విక్రయించే ప్రదేశాన్ని సందర్శించారు. తిరుమల నగర్‌లో సర్వేనెంబర్ 195/2 12 ఎకరాల 37 సెంట్లు, 195/4లో 28 ఎకరాల 82 సెంట్లు, మొత్తం 41 ఎకరాల 19 సెంట్లురు ఆంధ్రప్రదేశ్ సర్వే అకాడమీకి కేటాయించిన స్థలం ఉందని తెలిపారు. మంగళం పరిధిలోని వైకాపా నాయకులు గ్రావెల్ స్మగ్లర్లుగా తయారయ్యారని దుయ్యబట్టారు. రెండు నెలలు క్రితం గుట్టగా వున్న ప్రాంతాన్ని రాత్రివేళలో ధ్వంసం చేసి, 15 అడుగుల లోతు, 50 అడుగల వెడల్పుతో సుమారు కిలో మీటరు వరకు తోడేసారని, సుమారు రూ.6కోట్ల రుపాయాల గ్రావెల్‌ను అక్రమ రవాణా చేసారని ఆరోపించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ది ఇదేనా అంటూ నాని సెల్ఫీ సవాల్ విసిరారు. గ్రావెల్ అక్రమ రవాణాపై రెండు నెలలు క్రితం సబ్ కలెక్టర్‌కు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, చెయ్యి దులుపుకున్నారని వాపోయారు. టిడిపి అధికారంలోకి వస్తే మంగళం అక్రమ నిర్మాణాలను తొలగించి, ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకొంటుందని తెలిపారు. కలెక్టం స్పందించి అరికట్టాలన్నారు.

## రూ.5.61కోట్లతో రేణిగుంటరోడ్డు అభివృద్ధి

### -రామానుజసర్కిల్ నుంచి బిటిరోడ్డు నిర్మాణం






ప్రభాతవార్త-తిరుపతి:

ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో శ్రీనివాససేతు వారధి నిర్మాణపనులతో రోడ్ల నిర్వహణ అధ్వాన్నంగా తయా రైంది. ఇప్పటికే ఫ్లయిఓవర్‌పనులు పూర్తికావస్తున్న సమయంలో అనుబంధంగా ఉన్న నగర రోడ్లను సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఎంతో ప్రాధాన్యత ఉన్న....తిరుచానూరు రైల్వేస్టేషన్ రూపు దిద్దుకుంటున్న సమయంలో రవాణాకు మరింత సౌకర్యంగా ఉండేందుకు రోడ్ల నిర్మాణంపై అటు తిరుపతి నగరపాలక సంస్థ ఇటు టిటిడి దృష్టి సారించింది. తిరుపతి రామానుజ కూడలి నుంచి సుమారు ఎనిమిదికిలోమీటర్లు వరకు ఉన్న రేణిగుంట రోడ్డును అందంగా తీర్చిదిద్దే పనులకు ఇటీవల టిటిడి పాలకమండలి ఆమోదించింది. ఇప్పటికే రామానుజ విగ్రహం కూడలి మీదుగా హీరోహోండాషోరూమ్ వరకు శ్రీనివాససేతు ఫ్లైయిఓవర్ పనులు పూర్లయ్యి వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి.తిరుపతి నుండి రేణిగుంటవరకు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా ఈ రోడ్డును తారురోడ్డు నిర్మాణం పూర్తయిన తరువాత పూర్తిగా డివైడర్లు అభివృద్ధిచేసి, పచ్చని మొక్కలు, పూల మొక్కలతో బాటు భూగర్భవిద్యుత్ కేబుళ్ళ వ్యవస్థతో విద్యుత్‌దీపాలు వెలుగులు విరాజిల్లేలా ఏర్పాటుకానున్నాయి.ఇవన్నీ పూర్తయితే రామానుజకూడలి నుంచి రేణిగుంట వరకు ఉన్న రోడ్డు సుందరంగా తయారుకానుంది. యాత్రికులకు రవాణా కష్టాలు లేకుండా, వాహనాలు సాఫీగా ప్రయాణించేందుకు వీలుగా తిరుపతి రామానుజ కూడలి నుండి రేణిగుంట జంక్షన్ వరకు నూతనంగా 5.61 కోట్ల రూపాయల వ్యయంతో తారురోడ్డు నిర్మాణం కానుంది.

## జిల్లా ఎస్పి కార్యాలయంలో ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు



అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎస్పి పరమేశ్వర రెడ్డి

## శివయ్య ఆలయం భక్తులతో కిటకిట

### అభిషేకాలకు పెరుగుతున్న ఆదరణ



ఆలయంలో రాహుకేతుపూజల దృశ్యం

శ్రీకాళహస్తి, జూలై 4 ప్రభాతవార్త

దక్షిణ భారత దేశంలో పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన దివ్యక్షేత్రం శ్రీకాళహస్తి.మంగళవారం ఆలయం భక్తులతో కిట కిట లాడింది. ఇక్కడ నిర్వహిస్తున్న కాలసర్పదోష నివారణ పూజలకు ఎనలేని ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పూజల కోసం దేశ విదేశాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు.దాంతో రద్దీ చోటు చేసుకుంది. శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం కోసం ఇక్కడ నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజల కోసం భక్తులు నిరీక్షించారు.ఉదయం నుంచి ఆలయంలోనూ, పట్టణంలో భక్తుల రద్దీ చోటు చేసుకుంది.దేవస్థానం అందించిన సమాచారం మేరకు సోమవారం 20వేల మంది దర్శనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఇక వరుస సెలవులతో రద్దీ పెరుగుతుందని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇఓ వికెసాగర్‌బాబులు వివరించారు.మంగళవారం ఉదయం నుంచి భక్తులు రద్దీగా కనబడ్డారు.ముఖ్యంగా ఆలయంలో నిర్వహించే అభిషేకాలకు రద్దీ చోటు చేసుకుంది.ప్రత్యేకదర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసి ప్రవేశించిన వారు 1491 మంది కాగా రాహుకేతుదోష నివారణ పూజలు నాలుగు వేల ఐదు వందల మంది జరిపించుకున్నారు. అభిషేకాలకు రద్దీ ఏర్పడింది.

59 మంది అభిషేకాలు జరిపించుకోగా మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రభిషేకాలు 18 జరిగాయి.అర్చనలు 118,గోపూజలకు 26 మంది దీపారాధన. హోమాలు విశేష సంఖ్యలో జరిగినట్లు అధికారులు వివరించారు.కాగా చెంగల్వరాయస్వామి ఆలయంలో మంగళవారం సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేకాలంకారాలు జరిపారు.

# టీచర్లను నియమిస్తారా.. పాఠశాలకు తాళం వేస్తారా !!

కుప్పంరూరల్, జూలై 4 ప్రభాతవార్త

వందమంది విద్యార్థులు చదువుకుంటున్న పాఠశాలలో కేవలం ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే పనిచేస్తున్నారని విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయుల్ని నియమించాలని లేకుంటే పాఠశాల మూసేయాలని గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈసంఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని ఉర్ల ఓబనపల్లి పంచాయతీ కూర్మానిపల్లి ప్రభుత్వ పాఠశాలలో వందమంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ గతంలో ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేసేవారు. ఓ ఉపాధ్యాయురాలి పనితీరుపై తీవ్ర విమర్శలు రావడంతో ఆమె సస్పెన్షన్‌కు గురై ఇటీవలే మరోచోట విధుల్లో చేరారు. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న వందమంది విద్యార్థులకు ఒక్క టీచరే బోధించాల్సి ఉందని తల్లిదండ్రులు



- పాఠశాల ఎదుట కూర్మానిపల్లి గ్రామస్తుల నిరసన

వాపోతున్నారు. సోమవారం ఉపాధ్యాయుడు సెలవు పెట్టడంతో విద్యార్థులు ఇళ్లకు తిరిగి వచ్చేశారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన బాగుంటుందని భావించి తమ పిల్లలను ప్రైవేట్ స్కూల్ నుంచి తప్పించి ప్రభుత్వ బడిలో చేర్పిస్తే పరిస్థితి మరింత దారుణంగా మారిందన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని లేకుంటే పాఠశాలకు తాళాలు వేయాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు. మరి ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మాజీ మంత్రి అమరనాథరెడ్డికి సత్కారం

చిత్తూరురూరల్, జూలై 4 ప్రభాతవార్త:



మాజీ మంత్రి అమరనాథరెడ్డిని శ్రీ వెంకటపద్మావతి ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆయన నివాసంలో కలసి ప్రజారత్న బిరుదును ప్రదానం చేసి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రన్న ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవ చేయడమే తన జీవిత లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు డా. నందిపాటి చక్రపాణి, భారతీయ తెలుగు రచయితల సమాఖ్య వ్యవస్థాపకులు డా. మర్రిపూడి దేవేంద్రరావు, సంఘసేవకులు జి. భూపతి, ఆర్.ఈశ్వరరావు, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బిజెపి ఓబిసి మోర్చా సభ్యులుగా తులసినాథ్ నియామకం

కుప్పంరూరల్, జూలై 4 ప్రభాతవార్త



భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యవర్గ సభ్యుడుగా కుప్పంకు చెందిన సీనియర్ నేత ఎన్ఎస్ తులసినాథ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు గోపి శ్రీనివాస్ రొంగల ఉత్తర్వులు జారీ చేశారు. ఒబిసి మోర్చా కార్యక్రమాలు ప్రజల్లో తీసుకెళ్లి బిసిల సమస్యలపై ఉద్యమిస్తామని అలాగే పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తులసినాథ్ పేర్కొన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఎపి బిజెపి అధ్యక్షురాలిగా పురంధేశ్వరి నియామకం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## గిరిజన విద్యార్థులు 'అల్లూరి'ని ఆదర్శంగా తీసుకోవాలి

-ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్

తిరుపతి ప్రెస్‌క్లబ్,జూలై 4 ప్రభాతవార్త:



ఆదివాసుల హక్కులు,వాళ్ల అభివృద్ధి, సంక్షేమం కోసం బ్రిటిష్ రాజ్యంపై ఎదురు తిరిగి పోరాటం చేసిన మహనీయు డు, మన్యం వీరుడు 'అల్లూరి సీతా రామరాజు'ను ఆదర్శంగా తీసుకోవాలని ట్రైబల్‌స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు అక్కులప్ప నాయక్ గిరిజన విద్యార్థులకు పిలుపునిచ్చారు. మంగళవారం అల్లూరి 126వ జయంతిని పురస్కరించుకుని స్థానిక గిరిజన సంక్షేమ శాఖ హాస్టల్ నందు ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో భాగంగా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా అక్కులప్ప నాయక్ మాట్లాడుతూ భద్రాచలం నుండి సీతంపేట వరకు ఉన్న ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీల కోసం బ్రిటిష్ వారిపై,అలాగే పోలీస్ స్టేషన్లపై దాడులు చేసి తన ప్రాణాన్ని సైతం అర్పించిన ఘన చరిత్ర అల్లూరిదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం గిరిజనుల కోసం ఎన్ని సంక్షేమ కార్యక్రమాలు చేసినా అవి మారుమూల గ్రామాలు,ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులకు అందడంలేదని వాపోయారు.నేడు పోలవరం ముంపు ప్రాంతాల్లో గానీ,భద్రాచలం నుండి తూర్పు గోదావరి జిల్లా వరకు ఏజెన్సీ ప్రాంతాల ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని,ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వాటిని పరిష్కరించాలని ఆయన కోరారు. గిరిజనసంక్షేమశాఖహాస్టల్‌వార్డెన్‌హేమలత, టిఎస్ఎఫ్‌జిల్లాఅధ్యక్షుడునరేష్ నాయక్,మహేంద్ర, సాయికుమార్,సనీల్ నాయక్,హరికృష్ణ,రాజ్‌కుమార్, సాయి,శశికుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఐదవ అంతస్తు నుండి ప్రమాదవశాత్తు పడి వలస కూలి మృతి

తిరుపతి క్రైం, జులై 4, ప్రభాతవార్త

తిరుపతి రూరల్ మండలంలోని పుదిపట్ల గ్రామ పంచాయితీలో నిర్మిస్తున్న ఓ భవనం ఐదవ అంతస్తు నుండి ప్రమాదవశాత్తు పడి వలస కూలి డి. బాలాజీ (41) మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మృతుడు పొట్టి శ్రీరాములు జిల్లా, కావలి మండలం, రుద్రకోటకు చెందిన వాడు. ఇంటి నార్మాణానికి బేల్దారి కూలీగా వచ్చిన బాలాజీ ఐదవ అంతస్తులో పనులు చేస్తుండగా కాలు జారడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన వెంటనే చికిత్స కోసం రుయా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి భార్య వెంకట రమణమ్మ, తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు.

## బిజేపీ రాష్ట్రఅధ్యక్షురాలిగా పురందేశ్వరి నియామకంపై హర్షం

తవణంపల్లె, జూలై 4 ప్రభాతవార్త:

బిజెపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన అధ్యక్షురాలిగా ఆపార్టీ సీనియర్ నాయకురాలు దగ్గుపాటి పురందేశ్వరి నియామకం పట్ల ఆపార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర పార్టీ నూతన అధ్యక్షురాలిగా పురందేశ్వరిని నియమిస్తూ ఆపార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి.నడ్డా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆమెనియామకంపట్ల పార్టీ జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షుడు టి.శ్రీధర్ చౌదరి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కెవి.చంద్రమోహన్, జిల్లా నాయకులు జగదీశ వ్రరనాయుడులు హర్షం వ్యక్తం చేశారు. పురందేశ్వరి నియామకంతో రాష్ట్రంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## సిఎం సభకు తరలిన వైకాపా నాయకులు

చౌడేపల్లి, జూలై 4 ప్రభాతవార్త



జిల్లా కేంద్రం చిత్తూరులో జరిగిన ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి సభకు మండలం నుంచి వైకాపా నాయకులు అధిక సంఖ్యలో బయలుదేరి వెళ్ళారు. ఎంపిపి గాజుల రామ్మూర్తి, గడ్డంవారిపల్లి ఎంపిటీసీ తొండ శ్రీరాములు, నాయకులు గ్రెంధెం మంజునాథ్, చందులతోపాటు మండలంలోని వైకాపా నాయకులు, కార్యకర్తలు చిత్తూరుకు సిఎం సభకు వెళ్ళిన వారిలో వున్నారు.

## పురందేశ్వరీ నియామకం పట్ల హర్షం

చౌడేపల్లి, జూలై 4 ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా దగ్గుబాటి పురందేశ్వరీ నియామకం పట్ల పలువురు బిజెపి నేతలు హర్షం వ్యక్తం చేసారు. మండల బిజెపి అధ్యక్షుడు చిన్నికిషోర్, గందోడి ప్రవీణ్, రమణ, శ్రీనివాసులు, ఆంజనేయులు తదితరులు హర్షం వ్యక్తం చేసిన వారిలో వున్నారు.

## పిఇఎస్ ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం

కుప్పం, జూలై 4 ప్రభాతవార్త

పిఇఎస్ ఆస్పత్రిలో ఈనెల 17వతేది వరకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేసినట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటిండెంట్ డా॥ సిబి పాటిల్ తెలిపారు. జనరల్ సర్జరీ, స్త్రీ_గర్భకోశ వ్యాధులు, విరిగిన ఎముకలు, కీళ్ల సమస్యలు, చెవి,ముక్కు, గొంతు, చర్మ, మానసిక వ్యాధులకు పరీక్షలు జరుపుతామన్నారు. అలాగే ఆస్పత్రిలో చేరిన వారికి రక్త, మూత్ర పరీక్షలు, స్కానింగ్, ఎక్స్‌రే, బెడ్‌చార్జీలు ఉచితమన్నారు. మందులపై పదిశాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకంకు వర్తించినవారికి ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

కుప్పం, జూలై 4 ప్రభాతవార్త



మున్సిపల్ పరిధి సామగుట్టపల్లి యుపి స్కూల్‌లో మంగళవారం విప్లవ మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయుడు గాలి సురేష్ మాట్లాడుతూ స్వాతం త్ర్యం కోసం ఆంగ్లేయులపై పోరాటం చేసిన అల్లూరి జీవితం గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం దీనదయాళ్, ఉపాధ్యాయులు సౌజన్య, గాయత్రి, సరస్వతి, భువనేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రేమ,సంస్కారం పిల్లలకు నేర్పండి

- ఎఎస్పీ హనుమంత

చిత్తూరురూరల్, జూలై 4 ప్రభాతవార్త:



విద్యార్థులకు చిన్నప్పటి నుంచి ప్రేమ, సంస్కారం నేర్పించాలని అనంతపురం జిల్లా అడిషినల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ హనుమంత కోరారు. స్థానిక గాంధీరోడ్డులోని లిటిల్‌రోస్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు ఎఎస్పీ మోటివేషన్ తరగతులను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదల, అహింస, ఓర్పు, సహనం, యోగ, ధ్యానం తమ జీవితంలో తప్పనిసరి అంశాలుగా అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ఎఎస్పీని పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ బి.గోపాలక్రిష్ణమూర్తి, డైరెక్టర్ రాధిక గోపాలక్రిష్ణమూర్తి జ్ఞాపికను అందజేసి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ ఇన్‌ఛార్జి దుర్గా, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి : ఎంపీపీ నాగరాణి

వెదురుకుప్పం, జూలై 4 ప్రభాతవార్త :



జగనన్న సురక్ష పథకం ప్రయోజనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నాగరాణీ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని జక్కదొన, బొమ్మయ్యపల్లె సచివాలయం పరిధిలో ప్రజలకు సర్టిఫికేట్లు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రారంభించిన జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు అవసరమైన సర్టిఫికేట్లు అందజేయడంకు శ్రీకారం చుట్టిందన్నారు. అవసరమైన లబ్ధిదారులు సచివాలయంలో ధరఖాస్తు చేసుకుంటే వెంటనే అవసరమైన సర్టిఫికేట్లు అందించే కార్యక్రమం తీసుకురావడం జరిగిందన్నారు. ప్రజల అవసరాలను,గుర్తించి ప్రయోజనం కలిగించే పథకాలు తీసుకువచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని కొనియాడారు.జక్కదొన సచివాలయం పరిధిలో అర్హులైన 95మందిలబ్ధిదారులకు సర్టిఫికేట్లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడివో సుధాకర్‌రావు, డిప్యూటీ తహాశీల్ధార్ కోమల, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న టీడీపీ నాయకులు

వెదురుకుప్పం, జూలై 4 ప్రభాతవార్త :



మండలంలోని జక్కదొన పంచాయితీ పరిధిలోని నచ్చుకూరు గ్రామంలో జరిగిన ముత్యాలమ్మ జాతరకు తెలుగు దేశం పార్టీ నాయకులు హాజరై, అమ్మవారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. గ్రామస్థుల ఆహ్వానం మేరకు నాయకులు అమ్మవారి ఆలయంకు చేరుకుని పూజ కార్యక్రమంలో పాల్గొని దైవదర్శనం చేసుకుని తీర్ధప్రసాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర నెల్లూరు నియోజకవర్గం మాజీ ఇన్‌చార్జీ చిట్టిబాబు నాయుడు, మండల అధ్యక్షులు లోకనాధ రెడ్డి, మాజీ జిల్లాకార్యదర్శి మోహన్ మురళి, మండల కార్యదర్శి నరసింహ యాదవ్, నియోజకవర్గం మీడియా సమన్వయకర్త గురసాల కిషన్ చంద్, రాష్ట్ర సాంస్కృతిక విభాగపు ప్రధాన కార్యదర్శి మునిచంద్రా రెడ్డి, జిల్లా వాణిజ్య విభాగపు కార్యదర్శి వెంకటరమణా రెడ్డి,మండల రైతు అధ్యక్షులు రాజా రెడ్డి, నాయకులు మాధవ నాయుడు,బాబు నాయుడు,మురళి తదితరులుపాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## సీఎంను కలిసిన నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి

కోట, జూలై 4 ప్రభాతవార్త



చిత్తూరు జిల్లా పర్యటన నేపథ్యంలో మంగళవారం ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రేణిగుంట విమానాశ్ర యానికి చేరుకున్నారు. రాష్ట్ర వైసీపీ జాయింట్ సెక్రటరి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి రేణి గుంటలో ముఖ్యమంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అంద జేసిస్వాగతంపలికారు.ఆక్రమంలోనల్లపరెడ్డి వినోద్ కుమార్‌రెడ్డి, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పల రాజు, వైద్యశాఖ మంత్రి విడదల రజని, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, అటవీశాఖ మంత్రి పెది ద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలను కూడా కలిశారు. వినోద్‌కుమార్‌రెడ్డి వెంట మేరిగ మురళీధర్ కూడా ఉన్నారు.

## డిజిటల్ టెక్నాలజీపై ఉపాధ్యాయులకు శిక్షణ

కోట, జూలై 4 ప్రభాతవార్త

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల బోధనలో రాష్ట్రప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తెస్తోందని, ఇందులో భాగంగా డిజిటల్ టెక్నాలజీపై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు జరుగుతున్నాయని ఎంఇఓ మస్తానయ్య చెప్పారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు డిజిటల్ టెక్నాలజీపై ఈ నెల 15వ తేదీ వరకు విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణా తరగతులు జరుగుతాయని ఎంఇఓ తెలిపారు. ఈ శిక్షణా తరగతులు ఒక్కో బ్యాచ్‌కి 80 మంది చొప్పున ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారని తెలిపారు. అనంతరం శిక్షణ పొందిన ఉపాధ్యాయులు పాఠశాలలోని విద్యార్థులకు డిజిటల్ పాఠాలు చెప్తారని తెలిపారు.

## తడ మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం

తడ, జూలై 4 ప్రభాతవార్త



రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్ర మం మంగళవారం ప్రారంభమైం ది. మొదటి రోజు అండగుండల, భీములవారిపాలెం గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. అండగుండలలో ఎంపిడిఓ అమోస్‌బాబు, భీములవారిపాలెం లో తహశీల్దార్ జయజయరావుల ఆధ్వర్యాన రెండు బృందాలు కార్యక్రమాన్ని కొనసాగించాయి. ఈ నెల 7న గ్రద్దగుంట, ఇరకం, 11న కాదలూరు, కారూరు, 13న కారిజాత, పెరియవట్టు, 15న కొండూరు, పూడి, 18న మాంబట్టు, రామాపురం, 21న తడకండ్రిగ-1, తడకండ్రిగ-2, 25న తడ, వేనాడు గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆయా చోట్ల తమ బృందాలకు గ్రామస్తులు సహకరించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## పరిశ్రమ దొంగతనం కేసులో 12 మంది అరెస్ట్

తడ, జూలై 4 ప్రభాతవార్త



తడ మండలం మాంబట్టు సెజ్‌లోని శ్రీసుమంగళ పరిశ్రమలో మూడురోజుల క్రితం జరిగిన చోరీకి సంబంధించి 12 మంది నిందితు లను పోలీసులు పట్టుకున్నారు. పరిశ్రమలోని సమీప గ్రామాల వారే ఎక్కువమంది నిందితుల్లో ఉండటం విశేషం. రెండు టన్నుల బరువైన అల్యూమినియం రా మెటీరియల్ మూడు బండిల్స్‌ను ఈ కేసులో తడ ఎస్ఐ జెపి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు 3 లక్షల 80 వేల రూపాయలు ఉంటుందన్నారు. కంపెనీలో హెచ్‌ఆర్‌గా పనిచేస్తున్న కొమ్మిరెడ్డి సుమన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## జగనన్న సురక్ష క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద

వెంకటగిరి, జులై 4, ప్రభాతవార్త:



జగనన్న సురక్ష క్యాంపులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దొంతు శారద తెలిపారు. 14వ వార్డు ధర్మాపురంలో జగనన్న సురక్ష క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి కాని పనులను జగనన్న సురక్ష క్యాంపులో జరుగుతున్నట్లు చెప్పారు. కనుక జగనన్న సురక్ష క్యాంపుల్లో సమస్యలు తెలియజేసి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా జగన్ అన్న సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పలువురికి జగనన్న సురక్ష క్యాంపుల్లో పలు రకాల సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఢిల్లీ బాబు, శంకరయ్య, పోలేరమ్మ ట్రస్ట్ బోర్డ్ మాజీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, కమిషనర్ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

గూడూరు, జున్ 4, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని విద్యా శాఖ కార్యాలయంలో మంగళవారం ఎంపిడిఓ కె. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అల్లూరి సీతరామరాజు జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఆధ్యాత్మిక ప్రపంచంలో శాస్త్రీయ ఆలోచనలతో ప్రపంచానికి వివేకానందుడి సందేశం అద్భుతం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ మురళీకృష్ణ, ఉపాధ్యాయుల కృష్ణంరాజు, రమేష్, బాలాజీ, ఆర్ఎస్ఎస్ రవికుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా వాలంటీర్ వ్యవస్థ

చిల్లకూరు, జులై 4, ప్రభాతవార్త



రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం హయాంలో ప్రభుత్వానికి ప్రజలకి వారధిలాగా వాలంటరీ వ్యవస్థ పని చేస్తుందని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ అన్నారు. మంగళవారం ఉడతావారి పాల్యెం, బల్లవోలు గ్రామాల్లో నూతనంగా ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలోముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా 11 రకాల సేవలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. ఉడతావారిపాల్యెంలో 820 మందికి, బల్లవోలులో 516 మందికి వివిధ రకాల సర్టిఫికేట్లు ఇవ్వడం జరిగిందన్నారు. సచివాలయ కన్వీనర్‌లు, వాలంటీర్లు కలిసికట్టుగా ప్రజలకు సేవలు అందించాలన్నారు. అదే విధంగా రామారెడ్డి పాలెం గ్రామంలో ఉన్న ఎస్టీ కాలనీ మహిళలు త్రాగు నీరు సక్రమంగా రావడం లేదని, పక్కా గృహాలు, సీసీ రోడ్లు రావాలన్నారు. ఎక్కువగా విద్యుత్ కొరత సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోవడం సత్వరం పరిష్కరిస్తామన్నారు. అనంతరం సర్టిఫికేట్లు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఓ నిర్మల దేవి, స్పెషల్ ఆఫీసర్ చైతన్య కుమార్, జడ్పిటిసి శీనయ్య, సచివాలయ మండల కన్వీనర్ యదనపర్తి మనోహర్ రెడ్డి, ఎఎంసి మాజీ చైర్మన్ నల్లారెడ్డి రమేష్ బాబు రెడ్డి, వైస్ ఎంపిపి పోలుబోయిన చెంగయ్య, సచివాలయ కన్వీనర్లు డి. కిరణ్ రెడ్డి, చిరుకూరు పద్మజ, పంచాయితీ కార్యదర్శి వేణుగోపాల్ నాయుడు, రాజా, చంద్రశేఖర్, సర్పంచ్ పులి వజ్రమ్మ, గృహసారధులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో ఉన్న అసమానతలను తొలగించే ఏకైక ఆయుధం విద్య ఒక్కటే

గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద రావు

గూడూరు, జులై 4, ప్రభాతవార్త



సమాజంలో ఉన్న అసమానతలను తొలగించే ఏకైక ఆయుధం విద్య ఒక్కటేనని, పేద విద్యార్థులు చదువుకునేందుకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, ఎమ్మెల్యే వరప్రసాద రావు పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో అర్హులకు ధ్రువీకరణ పత్రాలను అందజేసారు. గూడూరు పట్టణంలోని సాదుపేట 1వ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వరప్రసాద్ రావు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ పొనక దేవసేనమ్మ పాల్గొని అర్హులకు ధ్రువీకరణ పత్రాలను అందజేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో అసమానతలను తొలగించే ఏకైక ఆయుధం విద్య మాత్రమేనని, పేద ప్రజలు చదువుకునేందుకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టిందని, సంక్షేమ పథకాలను పొందేందుకు అర్హత కలిగిన వారికి ఈ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా స్వీకరణ పత్రము అందజేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ పొనక దేవసేనమ్మ మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను అందుకోవడమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమని, ప్రజలు వద్దకు పరిపాలన అందించే దిశగా వీరి పాలన కొనసాగుతుందని, పేద ప్రజలందరూ జగన్‌మోహన్ రెడ్డి మా నమ్మకం అనే దృఢ సంకల్పంతో ఉన్నారని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ కమిషనర్ వెంకటేశ్వర్లు, వైఎస్ఆర్‌సిపి నాయకులు బొమ్మిడి శ్రీనివాసులు, అజీజ్ ఖాన్, అల్తాఫ్, జమల వాసు, ముని, సాయి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## అల్లూరు సీతారామరాజు 126 జయంతి వేడుకలు

చిల్లకూరు, జులై 4, ప్రభాతవార్త



చిల్లకూరు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో దేశ భక్తుడు, భారత దేశ పోరాట సమరయోధులు అల్లూరి సీతారామరాజు 126వ జయంతి వేడుకలు నిర్వహించారు. అల్లూరు సీతారామరాజు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ అజమతుల్లా ఖాన్, ఆర్ఐ రమ్య, స్వాతి, విఆర్ఓలు పాల్గొన్నారు.

## నారా లోకేష్‌తో భేటి అయిన డాక్టర్ మస్తాన్ యాదవ్

వెంకటగిరి, జులై 4, ప్రభాతవార్త:



టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌తో డాక్టర్ మస్తాన్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, సీనియర్ టీడీపీ నేత డాక్టర్ బొలిగర్ల మస్తాన్ యాదవ్ కలిశారు. యువగళం పాదయాత్రలో ఉన్న లోకేష్‌ను కలిసి పలు అంశాలను చర్చించారు. అనంతరం ఆయన పాదయాత్రలో నడక సాగించారు. ఆయనతో పాటు నియోజకవర్గ నాయకులు ఉన్నారు.

# అల్లూరి సీతారామరాజు మనకందరికి ఆదర్శనీయులు

## మేయర్ డా.శిరీష, కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, జులై 4, ప్రభాతవార్త

ప్రజల కోసం బ్రిటీషు వారిపై పోరాడిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు మనందరికి ఆదర్శనీయులని తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత అన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అల్లూరి 125వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూజలు నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ మణ్యం వీరుడు అల్లూరి సీతారామరాజు నుంచి మనమెంతో నేర్చుకోవాలని, ఆయుధలు కూడా లేని ఆ సమయంలో గిరిజన ప్రాంత ప్రజల కోసం ధైర్యంతో బ్రిటీష్ వారిపై పోరాడిన పోరాట పటిమ స్ఫూర్తి దాయమన్నారు. అల్లూరి సీతారామరాజు జయంతిని రాష్ట్ర పండుగగా జరుపుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడం సంతోషదాయకమన్నారు. స్వాతంత్ర్య ఉద్యమానికి



చేయూతనిచ్చిన మహనీయులను స్మరించుకోవడం, వారి ఆశయాలను పాటించడం మనందరి కర్తవ్యమని మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత అన్నారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు మన తెలుగు బిడ్డ కావ డం మనందరికి గర్వకారణమని, పేద ప్రజల కోసం ఆయన పోరాట పటిమ చరిత్రలో నిలిచిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు ఎస్‌కె బాబు, కార్పొరేటర్లు దొడ్డారెడ్డి, ప్రవళ్ళికా రెడ్డి ఆరణి సంధ్య, నరేంద్రనాథ్, కోటూరు ఆంజినేయులు, బోకం అనీల్ కుమార్, కోఆప్షన్ సభ్యులు ఇమామ్ సాహెబ్, రుద్రరాజు శ్రీదేవి, అదనపు కమిషనర్ సునిత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, రెవెన్యూ అధికారులు కెవెల్ వర్మ, సేతుమాధవ్, డిప్యూటీ సిటీ ప్లానర్ శ్రీనివాసులు రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, డిఈ విజయకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏర్పేడులో జనసురక్ష లో లబ్ది:

ఏర్పేడు (శ్రీకాళహస్తి రూరల్), జూలై 4 ప్రభాతవార్త



ఏర్పేడు మండల కేంద్రంలో మంగళవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జన సురక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలతో సామాన్యులకు మంచి జరుగుతుందని అధికారులు వివరించారు. వివిధ రకాల సర్టిఫికేట్లు కోరే వారికి ఎలాంటి రుసుములు లేకుండా సహాయం అందిస్తున్నామని తెలిపారు. శివపబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నల్లపాళెం శివయ్య అధ్యక్షతన కార్యక్రమాలు నిర్వహించారు. జడ్‌పిటిసి డాక్టర్ కావేరి తిరుమలయ్య, పర్యవేక్షించారు. మండల నాయకులు గున్నేరి కిషోర్‌రెడ్డి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. సింగిల్ విండో అధ్యక్షుడు జనార్ధన్ యాదవ్, కోఆప్షన్ సభ్యులు బత్తిశెట్టి వైసిపి నాయకకులు కూనాటి రమణయ్య యాదవ్, చెంగల్‌రాయులు, అధికారులు జ్యోతి మురుగయ్య, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వంగవీటి మోహనరంగా జయంతి వేడుకలు

శ్రీకాళహస్తి, జూలై 4 ప్రభాతవార్త



వంగవీటి మోహనరంగా విగ్రహం త్వరలో పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిపట్టణంలో ఏర్పాటు చేసేందుకు చర్యలుతీసుకుంటామని ఆయన ఆశయాలకోసం పోరాడుతామని శ్రీకాళహస్తీశ్వ రాలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు తారకశ్రీనివాసులు, మాజీ ఛైర్మన్ కోలా.ఆనంద్‌కుమార్‌లు అన్నారు. మంగళవారం వంగవీటి 76వ జయంతి వేడుకలను స్థానిక పెండ్లిమండపం వద్ద ఘనంగా నిర్వహించారు. ఆయన భారీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరుతారకశ్రీనివాసులు మాట్లాడుతూ వంగవీటిమోహనరంగా విగ్రహాన్ని త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. దేవస్థానం ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ కోలా.ఆనందకుమార్ మాట్లాడుతూ వంగవీటిరంగా పేద బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతిగా మహోన్నత వ్యక్తిగా ఎదిగారని ఆయన ఎదుగుదలను చూసి ఓర్వలేక హత్యారాజకీయాలకు పాల్పడడం దారుణమన్నారు. అయితే ఆయన ఆశయాలను సాధించే దిశగా కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో కాపు బలిజ, సామాజిక వర్గ నాయకులు అందరు ఏకతాటిపై వచ్చి కార్యక్రమాన్ని నిర్వహించడం ఐక్యతను చాటుకుందన్నారు. అనంతరం నిరుపేదలకు చీరలను, ఆటో డ్రైవర్లకు యూనిఫాంలను పంపిణీచేశారు. కార్యక్రమంలో పట్టణ వైకాపా అధ్యక్షుడు పగడాలరాజు, పూలకృష్ణమూర్తి, ఉప్పుకృష్ణయ్య, స్వర్ణమూర్తి, మందలబాలాజీ, ప్రభాకర్, బుల్లెట్‌జయశ్యాం, చింతామణి పాండు, మొగరాలగణేష్, కంటా ఉదయ్‌కుమార్, రవికుమార్, నాగమల్లిరాజ, ముత్యాలవెంకటకృష్ణ, చక్రాలమురళీ, యతిరాజులు, గరికపాటి రమేష్‌బాబు, గరికపాటిచంద్ర, బాలిశెట్టినరసింహులు, చింతామణి యానాది, సూరగారి రమేష్, మరియు లోకేష్‌యాదవ్, గిరిప్రసాద్‌గౌడ్, పసలకుమారస్వామి, పుట్టంరాజుముదిరాజ్, మేళాగారంసుబ్రమణ్యంరెడ్డి, పార్టీలకు కులాలకు అతీతంగా వచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు.

## చింతామణి గోవర్ధన్‌కు నివాళులు

తొట్టంబేడు, జూలై 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి కాపుసంఘ నాయకులు చింతామణి గోవర్ధన్ వర్ధంతి సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరుతారకశ్రీనివాసులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పట్టణంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సీనియర్ కాపు సంఘ నాయకులు కీ.శే. చింతామణి గోవర్ధన్ వర్ధంతి సందర్భంగా చింతామణి పాండు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని నివాళులుఅర్పించారు. కార్యక్రమంలో మాజీ ట్రస్టుబోర్డు ఛైర్మన్ కోలా.ఆనంద్‌కుమార్, కుమారులు చింతామణి పాండు, చింతామణి సతీష్, హేమకుమార్, జైరాజ్, సోదరులు చింతామణి యానాది, చింతామణి గోవర్ధన్, కాపు సంఘనాయకులు మోహన్‌రావు, జైగోపాల్, స్వర్ణమూర్తి, మండలబాలాజీ, ప్రభాకర్, బుల్లెట్‌జయశ్యాం, పగడాలరాజు, గణేష్, కంఠాఉదయ్‌కుమార్, బాలిశెట్టినరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## ఈ పాపం..టిప్పర్లదేనా?

-చెంబేడు కాలువపై వంతెనకు తూట్లు

.తొట్టంబేడు, జూలై 4 ప్రభాతవార్త



పూడి గ్రామం నుంచి శ్రీకాళహస్తి పట్టణంలోని పలు ప్రాంతాలకు ఇసుకను భారీ టిప్పర్లతోను, ట్రక్టర్లతోను తోలుతున్న విషయం విదితమే. పూడి గ్రామసమీపంలోని విరూపాక్షపురంలో ఉన్న ఇసుకరీచ్ నుంచి ఇసుకను తరలించే వాహనాల వల్ల రోడ్లు పాడైపోతున్నాయని పూడి గ్రామస్తులు గత పదిరోజుల క్రితం ధర్నా చేసిన విషయం విదితమే. అయితే జిల్లా కలెక్టర్ ఆదేశాలంటూ గ్రామస్తులుతో చర్చించి పోలీసులు ఇసుకరీచ్‌ల నుంచి టిప్పర్లు, ట్రాక్టర్లకు అనుమతించారు. అయితే అధికలోడుతో వెళ్తున్న టిప్పర్ల వల్ల చెంబేడుకాలువపై నిర్మించిన వంతెన ఓవైపు పడిపోవడంతో ఈమార్గంలో టిప్పర్లు ఆగిపోయాయి. అయితే ఇటీవల ఇసుక రవాణాపై మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడుకు కూడా పూడి గ్రామంలో ఉన్న యువత, పలువురు ప్రజలు పిర్యాదుచేశారు. ఇకనైనా ఇసుకరీచ్‌ల నుంచి ట్రాక్టర్లను ఆపివేయాలని పూడి, పెన్నలపాడు గ్రామస్తులు కోరుతున్నారు.

## అల్లూరిసీతారామరాజుకు ఘననివాళులు

శ్రీకాళహస్తి, జూలై 4 ప్రభాతవార్త



స్వాతంత్ర్యోద్యమ విప్లవ పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు 125వ జయంతి సందర్భంగా స్థానిక పాతబస్టాండు వద్ద అల్లూరిసీతారామరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ట్రస్టుబోర్డు మాజీ అధ్యక్షుడు, బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి కోలా.ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ తెల్లదొరలకు సింహస్వప్నంగా నిలచిన పోరాటయోదుడు, బ్రిటీష్ సామ్రాజ్యానికి వ్యతిరేఖంగా నిర్భయంగా పోరాడిన నాయకుడు అల్లూరి సీతారామారాజు ఒక్కడే అన్నారు. మన్యం విప్లవ యోదుడుగా గుర్తించి కాంస్య విగ్రహాన్ని దేశ ప్రధాని నరేంద్రమోడీ ఆవిష్కరించారన్నారు. కార్యక్రమంలో పట్టణ బిజెపి అధ్యక్షుడు గరికపాటిరమేష్‌బాబు, కో.కన్వీనర్ మేళాగారంసుబ్రమణ్యంరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కంద్రిగ.ఉమ, రాష్ట్ర మహిళా మోర్చా సభ్యురాలు చాగణం శైలజ, ఉమాసింగ్, పట్టణ ప్రధాన కార్యదర్శులు మద్దువాసుయాదవ్, పుణ్యండిల్లీకుమార్, కిరణ్, గోపాల్, ప్రసాద్, కృష్ణయ్య, బాలగురవయ్య, రమేష్‌యాదవ్, ప్రతాప్, సుధాకర్, మోహన్, భరత్‌నాయుడు, హరీష్, మణి, వెంకటసుబ్బయ్య, పాండు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## 'అమూల్'కు బ్రాండ్ అంబాసిడర్‌గా మారిన సిఎం జగన్

-జిల్లా పాడి రైతులను నిలువునా మోసం చేశారు

-టిడిపి తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్ ధ్వజం

తిరుపతి ప్రెస్‌క్లబ్, జూలై 4 ప్రభాతవార్త:



హెరిటేజ్, సంగం పాల డైరీలపై కక్షతో చిత్తూరులోని విజయ డైరీ పునరుద్దరణ పేరుతో ఎక్కడో గుజరాత్ రాష్ట్రానికి చెందిన 'అమూల్' సంస్థకు రెడ్ కార్పెట్ పరచి సిఎం జగన్ బ్రాండ్ అంబాసిడర్‌లా మారారని టిడిపి సీనియర్ నేత, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు జి.నరసింహయాదవ్ ఏద్దేవా చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన టిడిపి నాయకులతో కలిసి మాట్లాడుతూ 650 కోట్ల రూ॥ల విలువ కలిగిన ఆస్తులు, 33 ఎకరాల భూమి కలిగిన విజయ డైరీని అమూల్ సంస్థకు ధారాదత్తం చేసి ప్రజా సంపదను దోచిపెడుతున్నారని మండిపడ్డారు. తన కేసుల మాఫీ కోసం ఏడాదికి కోటి రూ॥ల లెక్కన 99 ఏళ్లకు లీజుకు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. తాను ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో తాము అధికారంలోకి వస్తే సహకార రంగాన్ని పునరుద్దరిస్తామని, సహకార డైరీలకు పాలు పోసే ప్రతి పాడి రైతుకు లీటరుకు అదనంగా 4 రూ॥ల బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి రైతుల ఓట్లు దోచుకుని సిఎం అయ్యి, నేడు ఆ రైతులను దగా చేశాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. అలాగే జిల్లాలోని చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ, రేణిగుంట మండలం గాజులమండ్యం షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్దరించి, చెరకు రైతులకు రావాల్సిన బకాయిలను ఇప్పిస్తామని నమ్మించి ఓట్లేయించుకుని అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయినా, ఆ హామీని నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దంపూరి భాస్కర్‌యాదవ్, కార్పొరేటర్ ఆర్సీ.మునికృష్ణ, నాయకులు ఊకా విజయ్‌కుమార్, మనోహరాచారి, సింగంశెట్టి సుబ్బరామయ్య, మునిరామయ్య, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి అధ్యక్షురాలిగా పురంధరేశ్వరి నియామకంపై హర్షం

పుత్తూరు, జూలై 4 ప్రభాతవార్త :

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలిగా కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురంధరేశ్వరి నియమితుల వడం పట్ల ఆ పార్టీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు ఎం.నిషిధరాజు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆమె నేతృత్వంలో బిజెపి ఆంధ్రప్రదేశ్‌లో బలోపేతం అవుతుందని ఆకాంక్షించారు. రానున్న ఎన్నికల్లో బిజెపి తన సత్తా చూపుతుందన్నారు.

## అర్హులందరికీ ప్రభుత్వ పధకాలు

ఇదే జగనన్న సురక్ష లక్ష్యం..!, ఎంపిపి హేమేంద్రకుమార్ రెడ్డి

చంద్రగిరి, జూలై 4 ప్రభాతవార్త:



అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పధకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి మావిళిరెడ్డి గారి హేమేంద్రకుమార్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పనపాకం, నరశింగాపురంలో మంగళవారం జగనన్న సురక్ష ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పధకం ద్వారా 11 రకాల పౌర సేవలు ఉచితంగా అందించడమే ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. పౌర సేవల కొరకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు ప్రభుత్వ పధకాలను తమ ఇంటి వద్దే అందించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా 1) ఆదాయ ధృవీకరణ పత్రం, 2) డేట్ ఆఫ్ బర్త్, 3) ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్లు (కుల, నివాస ధృవీకరణ పత్రాలు), 4) మరణ ధృవీకరణ పత్రం, 5) మ్యుటేషన్ ఫర్ ట్రాన్సాక్షన్, 6) కొత్త రేషన్ కార్డు లేదా రేషన్ కార్డు విభజన, 7) ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, 8) ఆధార్ కార్డులో మొబైల్ నంబర్ అప్ డేట్, 9) కౌలు గుర్తింపు కార్డులు (సిసిఆర్‌సి), 10) 60 రోజుల్లోలోపు వివాహ ధృవీకరణ పత్రం, 11) ప్రభుత్వ డేటాకు సంబంధించి కుటుంబ వివరాల్లో కొంత మంది సభ్యుల పేర్ల తొలగింపు వంటి సేవలు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా దరఖాస్తులు చేసుకున్న నరశింగాపురం 483, పనపాకం 300 మందికి తమ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శిరీషా, ఈఓఆర్‌డి శశిరేఖ, జడ్పీటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి, వైస్ ఎంపిపి వెంకటరత్నం, మండల కో అప్షన్ సభ్యుడు ఔరంగజేబు, నాయకులు ప్రకాష్ రెడ్డి, మించల ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## సిఐ ఆనందరావు మృతి బాధాకరం

టిడిపి ఇన్‌చార్జ్ పులివర్తి నాని

చంద్రగిరి, జూలై 4 ప్రభాతవార్త:



సిఐ ఆనందరావు మృతి అత్యంత భాధాకరమని టిడిపి ఇన్‌చార్జ్ పులివర్తి నాని అన్నారు. మండల పరిధిలోని కల్‌రోడ్డుపల్లికి చెందిన ఆనందరావు అనంతపురం జిల్లా, తాడిపత్రి పట్టణ సిఐగా విధులు నిర్వహిస్తూ, ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ నేపధ్యంలో ఆయన భౌతికాయాన్ని సోమవారం సొంతూరుకు తీసుకువచ్చారు. ఈ క్రమంలో మంగళవారం నాని ఇక్కడికి చేరుకుని ఆనందరావు మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామంలో సౌమ్యుడుగా కీర్తి గడించిన ఆనందరావు దురదృష్టకరమన్నారు.

## రేపు మండల సర్వసభ్య సమావేశం

విజయపురం, జూలై 4 ప్రభాతవార్త :

ఈ నెల ఆరో తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి జమున అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఓ ప్రసాద్ తెలిపారు. సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

## వాడవాడల్లో జగనన్న సురక్ష సభలు

శ్రీకాళహస్తి రూరల్, జూలై 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల్లో జగనన్న సురక్ష సభలను వైకాపా నాయకులు నిర్వహించారు. మంగళవారం శ్రీకాళహస్తి మండలం ఇనగలూరు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పథకంలో భాగంగా 708 మంది దరఖాస్తుదారులకు 11 రకాల ధృవ పత్రాలను అందించారు. ఆధార్ సేవలో మొబైల్-ఆధార్ లింకింగ్, కొత్త ఆధార్, కార్డులు 5-6 మరియు 15-17 సంవత్సరాల వయస్సు గల వారికి బయోమెట్రిక్ అప్‌డేషన్ ఎసేవలు 40మందికి ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమాలకు గ్రామ సర్పంచ్ సి.నాగరాజురెడ్డి అధ్యక్షత వహించారు. వైసిపి పార్టీ కన్వీనర్లు, గృహసారధులు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మండల తహశీల్దార్ ఎస్ ద్వారకానాధరెడ్డి, ఇన్‌చార్జి ఈ ఓ ఆర్ డి శారదాదేవి పంచాయతీ కార్యదర్శి గోపాల్, విఆర్‌ఓ ఎం.నల్లయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా వేదాం సచివాలయ పరిధిలో 523 మంది దరఖాస్తుదారులకు ధృవ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ వి.రమణయ్య, అధ్యక్షతన జరిగింది. సర్పంచ్ పుట్టంరెడ్డి బాలిరెడ్డి ఎంపిటిసి సుమలత, ఎంపిడిఓ పఠాన్ రఫీ ఖాన్, పంచాయతీకార్యదర్శి పావని తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సివి నివాసంలో దేశం సందడి

శ్రీకాళహస్తి, జూలై 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు తెలుగుదేశం పార్టీలో పునఃప్రవేశించటంతో ఆయన ఇంటి వద్ద రాజకీయ సందడి చోటు చేసుకుంది. మంగళవారం సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు మండలానికి చెందిన నాయకులు ఎస్‌సివి నాయుడును సత్కరించారు. నియోజకవర్గంలో ఎస్‌సివి ప్రవేశం తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం వస్తుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటి మాజీ అధ్యక్షుడు ఎలాగో రెడ్డి,, దేశం నాయకుడు రవినాయుడు, మాజీ సర్పంచ్ సతీష్ గోవిందగిరి, సర్పంచ్ పెద్దరాజు, రాంగిరి గోపాల్‌నాయుడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా కెవిబిపురం, పిచ్చాటూరు మండల నాయకులు ఎస్‌సివి నాయుడును కలసి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండాను ఎగురవేయటానికి తమను చైతన్యవంతుల్ని చేయాలని కోరారు. కార్యక్రమాల్లో మాజీ తొట్టంబేడు మార్కెటింగ్ కమిటి అధ్యక్షుడు రామాంజులు నాయుడు, మండల అధ్యక్షుడు గోపినాథ్‌రెడ్డి, సతీష్‌నాయుడు, పద్మనాభరాజు, సురేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, యాదచంద్రనాయుడు, చంద్రయ్యనాయుడు, వెంకటేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మరాజుల స్వామి ఆలయంలో కుంభం

శ్రీకాళహస్తి, జూలై 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం మధ్యాహ్నం ఆలయం వద్ద కుంభం కార్యక్రమాల్ని సంప్రదాయబద్దంగా నిర్వహించారు. ఆలయ పూజారి దయానందం ఆయన కుమారుడు పురుషోత్తంల పర్యవేక్షణలో కుంభం ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎఇఓ లోకేష్‌రెడ్డి, చిన్న ఆలయాల ఇన్‌చార్జి వెంకటస్వామి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఒక్కడే కష్టపడితే 'సంజాయిషి' నోటీసులా?

శ్రీకాళహస్తి, జూలై 4 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం అధికారులు ప్రభుత్వం ఆదేశాల మేరకు విజయవాడలోజరుగుతున్న శాకాంబరి ఉత్సవాలకు సారె తీసుకెళ్ళాలన్న ఆదేశాలతో ఇఓ, డెప్యూటీ ఇఓలు ధర్మకర్తల మండలి తో కలసి వెళ్ళారు. ఈ సందర్భంగా ఆలయంలో ఎఇఓ సతీష్‌మాలిక్ ఒక్కడే విధి నిర్వహణలో ఉన్నారు. ఆయన తన పరిధిలో అడ్డదారి దర్శనాలు, అంతరాలయ దర్శనాలకు చెక్ పెట్టారు. అయితే కొన్ని అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ అంశాలు మీడియాలో ప్రచురితమైంది. దాంతో విధి నిర్వహణలో జవాబుదారి తనంతో పని చేసిన ఎఇఓకు 'సంజాయిషి' నోటీసు జారి చేయటం చర్చనీయాంశంగా మారింది. పని చేస్తే శిక్షలా?

# తిరుపతి డివిజన్

## స్మార్ట్ సిటీ అభివృద్ధిపై శ్వేతపత్రం సమర్పించాలి

బిజెపి నేత సతీష్ రెడ్డి డిమాండ్

తిరుపతి కలెక్టరేట్, జులై 4, ప్రభాతవార్త



స్మార్ట్ సిటీ ముసుగులో అధికారులు దోపిడీకి పాల్పడుతున్నారని తిరుపతి జిల్లా బిజెపి మీడియా సమన్వయ కర్త మిట్టపల్లి సతీష్ రెడ్డి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో 77 రకాల ప్రాజెక్టుల కోసం కేంద్రం ఇచ్చిన 1680 కోట్ల నిధులు ఏమయ్యాయో సరైన లెక్కలు లేవన్నారు. స్మార్ట్ సిటీ అభివృద్ధి కోసం ఈ పదేళ్లలో చేసిన ఖర్చులు, సాధించిన ప్రగతి పై శ్వేతపత్రం సమర్పించాలని డిమాండ్ చేసారు. నగరంలో రవాణా సౌకర్యాల మెరుగు కోసం కొన్న 60 సిటీ మిని బస్సులు ఎక్కడ ఉన్నాయో చూపాలన్నారు. దీనికి అధనంగా మరో 20 బస్సులు కూడా కొనవల్సి ఉందని చెప్పారు. మురుగు నీరు, వర్షపు నీటిని శుభ్రం చేసే ట్రీట్మెంట్‌ప్లాంట్‌ల వివరాలు తెలపాలని కోరారు. నగరంలో 20 శాతం సోలార్ విద్యుత్ వాడుతున్నట్లు తప్పుడు లెక్కలు చూపారని విమర్శించారు. నడక దారులు ఎక్కడ కొత్తగా నిర్మించారో, సైకిల్ రాకపోకల దారులు ఎక్కడ ఉన్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇళ్ళ ప్లాన్‌లను ఆన్‌లైన్ ద్వారా 17 రోజుల్లో మంజూరు చేయాల్సి ఉందని, అయితే నెలలు గడుస్తున్నా ఇబ్బందులు పడే వారు ఉన్నారని చెప్పారు. నగరంలో ఆధునిక రహదారుల నిర్మాణం చేసిన దాఖలాలు కనిపించడం లేదన్నారు. ప్రధాన రహదారులు తప్ప మిగిలిన రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు బాధ్యత వహించి స్మార్ట్ సిటీ అభివృద్ధిపై శ్రద్ధ వహించాలని కోరారు.

## ఘనంగా స్వామి వివేకానంద వర్ధంతి

తిరుపతి కలెక్టరేట్, జులై 4, ప్రభాతవార్త



భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో స్థానిక మెడికల్ కాలేజీ వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వామి వివేకానంద ఆశయాలను సాధించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపినాథ్, బిజెపి అలిపిరి మండల అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, బిజెపి తూర్పు మండల ఉపాధ్యక్షుడు తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ రెడ్డి, బిజెపి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి కవిత, బిజెపి సీనియర్ నాయకులు కొండే చెంగారెడ్డి, సురేష్ స్వామి, జగదీశ్వర్ నాయుడు, జయంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వంగవీటి రంగా, అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు

తిరుపతి ప్రెస్‌క్లబ్, జూలై 4 ప్రభాతవార్త:



మంగళవారం స్థానిక అనంతవీధిలోని కార్యాలయంలో రాధా-రంగా మిత్రమండలి జిల్లా అధ్యక్షుడు, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో స్వర్గీయ వంగవీటి మోహనరంగా 76వ జయంతి, అలాగే మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 126వ జయంతిని పురస్కరించుకుని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి, కొబ్బరి కాయలు కొట్టి, పూజలు చేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఆర్కాట్ మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అయిన వంగవీటి మోహనరంగా సమాజంలో కులమతాలకు అతీతంగా ప్రజలకు ఎంతో సేవ చేశారని కొనియాడారు. అలాగే బ్రిటిష్ వారిని గడగడ వణికించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజని కీర్తించారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ సురేష్, జగన్నాధం, గోపిప్రసాద్, రెడ్డెప్పరెడ్డి, జ్ఞానేశ్వరి, పద్మ, భానుప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ప్రాధాన్యత బీజేపీతోనే - బీడీ బాలాజీ

రేణిగుంట, జూలై 4 ప్రభాతవార్త:



భారతదేశంలో మహిళలకు ప్రాధాన్యతనిస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అని తిరుపతి పార్లమెంటరీ జిల్లా బీజేపీ ఓబీసీ అధ్యక్షుడు బీడీ బాలాజీ నొక్కి వక్కాణించారు. ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర పగ్గాలు దగ్గుపాటి పురంధరేశ్వరికి అధిష్టానం అప్పగించడం శుభ పరిణామం అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలుగా పురంధేశ్వరి నియమించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర పార్టీ చరిత్రలోనే మొదటి సారి మహిళకు గురుతర బాధ్యతలు అప్పగించిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. రాష్ట్రపతిగా ద్రౌపతిముర్ముకు అవకాశం కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పురంధరేశ్వరిని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలుగా నియమించినందుకు భారత ప్రధాని మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు జగత్ ప్రకాష్ నడ్డా, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్, సింగుకు ధన్యవాదాలు తెలిపారు.

## మా కడుపులు కొట్టకండి

రేణిగుంట, జూలై 4 ప్రభాతవార్త:



మా కడుపులో కొట్టకండి అంటూ పలువురు ట్రాక్టర్లు, టిప్పర్లు, యజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు ఇసుక కాంట్రాక్టర్లమని చెబుతూ తమ ట్రాక్టర్లను, టిప్పర్లను తిరగనివ్వకుండా అడ్డుకుంటున్నారంటూ వాటి డ్రైవర్లు యజమానులు గాజుల మండ్యం పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం ఆవేదనతో కూడిన నిరసన వ్యక్తం చేశారు. రీచ్‌లకు అనుమతి లేకున్నా తమపై పెత్తనం చెలాయిస్తున్నారంటూ కన్నీటి పర్యంతమయ్యారు. వాహనాలు తిరగడం వల్లే తమకు జీవనోపాధిని అవి తిరగకపోతే పస్తులు ఉండాల్సిందేనన్నారు. జిల్లా కలెక్టర్ తమపై కనికరం చూపుతున్నా కొంత మంది ఇబ్బంది కలిగిస్తున్నారని బాధను వ్యక్తపరచారు. తమ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆత్మహత్యలు తప్ప వేరే గత్యంతరం లేదన్నారు. అధికారులు తక్షణం స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఆవేదన వ్యక్తం చేసిన వారిలో దీనాబాబు, పలువురు వాహనాల డ్రైవర్లు, యజమానులు ఉన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సీఐ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐ ధర్మారెడ్డి, చాకచక్యంగా వ్యవహరించి పరిస్థితిని సర్దుబాటు చేశారు.

## మాతమ్మ సేవలో గాలి భానుప్రకాష్

నగరి, జూలై 4 ప్రభాతవార్త:



నగరి పట్టణ పరిధిలోని కాకవేడు ఆది ఆంధ్రవాడలో జరుగుతున్న మాతమ్మ దేవాలయం కుంభాభిషేకంలో గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. మంగళవారం ఆయనకు కాకవేడు ఆది ఆంధ్రవాడ వాసులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. ఆయన మాతమ్మకు మొక్కులు తీర్చుకున్నారు.

## లబ్ధిదారులకు ధృవపత్రాలు పంపిణీ

వడమాలపేట, జూలై 4 ప్రభాతవార్త:



జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు వడమాలపేట మండలం ఎస్‌బీఆర్ పురం గ్రామ సచివాలయంలో లబ్ధిదారులకు ప్రత్యేక అధికారి గీతారాణి ధృవపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు అవసరమైన ధృవపత్రాలు అధికారులు మీ గ్రామానికి వచ్చి అందజేయడం జరుగుతుందన్నారు. కుల ధృవీకరణ పత్రాలు 254, ఆదాయ ధృవపత్రాలు, 259 ఆధార్ మొబైల్ లింక్, 11 రైస్ కార్డు, 5 కుటుంబ సభ్యుల ధృవ పత్రాలు ముగ్గురికి అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.భానుమూర్తిరావ్, తహసీల్దార్ ఐ.సుబ్రహ్మణ్యం, అన్ని శాఖల మండల స్థాయి, క్షేత్ర స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వైెసీపీ నాయకులు రామ్‌ప్రసాద్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సురేష్‌రాజు, వెంకటరమణ, ఎంపీటీసీ కనకమ్మ, పీసీ చంద్రరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బిజెపి వెంకటమునికి జన్మదిన శుభాకాంక్షలు

చంద్రగిరి, జూలై 4 ప్రభాతవార్త:



భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు, తిరుపతి జిల్లా బిజెపి కార్యాలయ ఇన్‌చార్జ్ కె.వెంకటముని జన్మదిన వేడుకలు తిరుపతి జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. చంద్రగిరి మండలం, శానంబట్ల పంచాయతీకి చెందిన వెంకటముని పార్టీలో చురుకైన నాయకుడుగా సుధీర్ఘకాలం పాటు సేవలందిస్తున్నారు. ఈ నేపధ్యంలో మంగళవారం ఆయన పుట్టిన రోజును పురస్కరించుకుని జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపినాథ్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నరేష్‌కుమార్ నాయుడు, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి కవిత, తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి సుబ్రమణ్యం రెడ్డి, రాజా చౌదరి ఆయనను ఘనంగా సన్మానించే, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

